విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

## ఎనర్జీ అసిస్టెంట్, విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - విశాఖ: సచివాలయ ఎనర్జీ సెక్రటరీలను విస్మరించి వారి బ్రతుకులను గాలిలో దీపాలుగా మార్చివేస్తున్నారని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి వి మంజునాథ్, రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకాశి విమర్శించారు. గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్, విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సు సోమవారం జరిగింది. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లో 19 శాఖల ఉద్యోగులను నియమించిందని, అయితే 18 శాఖల ఉద్యోగుల పనితీరును పర్యవేక్షిస్తూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఒక్క ఎనర్జీ అసిస్టెంట్‌లను పూర్తిగా విస్మరించారని అన్నారు. వారికి నేటికీ మెడికల్ లీవ్, ఈఎల్, మెటర్నిటి లీవుతో పాటు ఇతర సెలవులు కూడా అమలు కావడంలేదని తెలిపారు. నో వర్క్ నో పే అంటూ జీతాలలో కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పగలు, రాత్రి, పండుగ, ఆదివారం అన్న తేడా లేకుండా 24/7 పనిచేయిస్తూ మానసికంగా ఒత్తిడికి గురిచేస్తున్నారని, దీని వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 140 మంది సచివాలయ ఎనర్జీ సెక్రటరీల మరణించారని చెప్పారు. మరో 300 మందికి పైబడి అంగవైకల్యం పాలయ్యారని చెప్పారు. గత 20 సంవత్సరాలుగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని, వారందరికీ పీస్ రేటు విధానాన్ని తొలగించి కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అదే విధంగా ఈ రంగంలో పనిచేస్తున్న అందర్నీ తెలంగాణ తరహాలో క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జీఎస్‌జె అచ్యుతరావు, అధ్యక్షులు ఎం.మన్మధరావు, అనకాపల్లి జిల్లా ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దొరబాబు, వడాల గోవిందు, ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు సూర్య, ప్రవీణ్, బిల్ రీడర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి పాల్గొన్నారు.

## యువత ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: యువత ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ శాఖకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎన్ఐ-ఎంఎస్ఎంఈ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరియా స్వరూప అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంక్యుబేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సోలార్ ఎనర్జీ అండ్ ఫోటోవోల్టిక్ పీవీ సిస్టమ్స్' ఐదు రోజుల ఈఎస్‌డిపి ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. దేశంలో 54 మంది యువత ఉన్నప్పటికీ గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్ 43వ స్థానంలో నిలవడం జరిగిందన్నారు. యువత సౌరశక్తిని ఉపయుక్తంగా నిలుపుకునే ఆవిష్కరణలు జరపాలని సూచించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలకు లేని సంపద, మన దేశానికి ఉన్న పెద్ద సహజ వనరుగా సౌరశక్తి నిలుస్తుందన్నారు. భారత్‌కి సౌరశక్తి ఒక వరంగా నిలుస్తోందని, దీనిని వ్యాపారంగా మార్చుచేసే దిశగా స్టార్టప్‌లు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏయూ ఐపిఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఏయూ ఎ హబ్ సిఈఓ రవి ఈశ్వరపు, మేనేజర్ దివాకర్ తదితరులు ప్రసంగించారు.

## ఏకాగ్రతతో పరీక్షలు రాస్తే విజయం తథ్యం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విద్యార్థులు ఏకాగ్రత, ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తే విజయం తథ్యమని శిష్టకరణ యువత రాష్ట్ర అధ్యక్షుడు మానాపురం సురేష్‌కుమార్ అన్నారు. కూర్మన్నపాలెం అసోసియేషన్ కార్యాలయంలో పరీక్షలు రాసే పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష మెటీరీయల్ పంపిణీ చేశారు. జీవితంలో లక్ష్యం గుర్తు చేసుకొని ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు రిటైర్డ్ ఉద్యోగి ఎం.సత్యనారాయణ, కూర్మన్నపాలెం శాఖ కార్యదర్శి డి.సత్యారావు, అధ్యక్షుడు పీఎస్వీఎన్.గోపాల్, కోశాధికారి గురునాథం, యువత రాష్ట్ర కార్యదర్శి రవికాంతం, ఉపాధ్యక్షుడు నర సింహారావు, ఎస్.వరలక్ష్మి, కె.రవీంద్ర, పీవీఎస్.మూర్తి, కె.రామచంద్ర రావు, టిటి.ప్రసాద్, ఎస్.శంకర్, బీవీఎస్ఎన్.పాత్రుడు, జీవీఎన్.మౌళి, జె.రమేష్, డి.ప్రసాదరావు పాల్గొన్నారు.

## జనసేన పల్లె యాత్ర

విశాలాంధ్ర - పద్మనాభం: పల్లె పల్లెకు జనసేన కార్యక్రమంలో భాగంగా మద్ది గ్రామంలో జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ సందర్శించారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కాళ్ళ నగేష్ కుమార్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున టీడీపీ, జనసేన అభిమానులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కోరాడ రమణ, మండల తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ళ సత్యనారాయణ, పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితులంతా ఏకమై పోరాడాలి

విశాలాంధ్ర - మల్కాపురం: దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చింతల లోవ గ్రామంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దళిత హక్కుల పోరాట సమితి విశాఖ జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు హాజరై మాట్లాడుతూ దళితులకు ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇవ్వాలని, ప్రతి దళిత కుటుంబానికి ఉచితంగా జగనన్న ఇల్లు ఇవ్వాలని, కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం చేయాలన్నారు. ప్రతి దళితవాడలో రోడ్లు డ్రైనేజీలు వేయాలన్నారు. రానున్న రోజుల్లో కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వాలకు దళితులందరూ ఏకమై దళితులకు ద్రోహం చేస్తున్న వారిని అణగదొక్కాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దళిత కుల పోరాట సమితి విశాఖ జిల్లా ప్రెసిడెంట్ ఎస్.రాజు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం శొంట్యాం పంచాయతీకి చెందిన పల్లా రమణ (49) లివర్ సిర్రోసిస్ అనారోగ్య సమస్యతో బాధపడుతుండటంతో వైద్య ఖర్చులు నిమిత్తం

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 10 లక్షలు చెక్కును కుమారుడైన పల్లా దుర్గా ప్రసాద్‌కి అవంతి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, సర్పంచులు బిఆర్‌బి నాయుడు, షినగం అప్పలరాజు, లంక రాంబాబు, కోరాడ ముసలి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై బుర్ర కథ ద్వారా అవగాహన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల సంతలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుర్ర కథ కళాకారుడు ఎంఎం.దాస్‌చే పద్యాలు, పాటల ద్వారా ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ వి.పూర్ణయ్య, ఆర్ఐ యడ్ల వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమల్లో ఏపీ ఆదర్శనీయం

విశాలాంధ్ర - యస్.రాయవరం: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే ఆదర్శనీయంగా నిలిచిందని ఉత్తరాంధ్ర వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మండలంలో అడ్డరోడ్డు తిమ్మాపురం గ్రామంలో పాయకరావుపేట నియోజకవర్గం స్థాయి సిద్ధం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. అవినీతి లేకుండా గ్రామ వాలంటరీ సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజలకు పథకాలు అందించారని, టిడిపి ప్రభుత్వం గ్రామ కమిటీల పేరుతో అవినీతి చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నమ్ముకున్న వారికి ఎప్పుడు న్యాయమే చేస్తారని పార్టీ ఏర్పాటు నుండి ఉన్న ఎమ్మెల్యే గొల్ల బాబురావుకు రాజ్యసభ ఎంపీగా ఎంపిక చేయడం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం దానికి నిదర్శనని అన్నారు. కొద్దిరోజుల్లో జరిగే ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కంబాల జోగులను అత్యధిక మెజార్టీతో కార్యకర్తలు గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతి, అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్య నారాయణరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ కొణతాల ఉమాదేవి, వైసీపీ సీనియర్ నాయకులు బొలిశెట్టి గోవిందరావు, దత్తుడు బాబు, పైల రమేష్, కొణతాల శ్రీనివాస రావు, దనిశెట్టి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి మూడు.. పెందుర్తి చూడు!

### ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ వినూత్న రీతిలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వచ్చేనెల మూడో తారీఖున మార్చి మూడు...పెందుర్తి చూడు అంటూ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం పెందుర్తి కూడలిలో గల తాండ్రపాపారాయ కళ్యాణ మండపంలో పార్టీ పరిశీలకుడు మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డితో కలిసి ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేపగుంట సమీపంలోని బొడ్డపాటి ఎస్టేట్‌లో గతంలో ఎన్నడూ లేనంత భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిపక్షాల విమర్శలకు ఆస్కారం లేకుండా డ్వాక్రా మహిళలు, అంగన్వాడి కార్యకర్తలు ప్రమేయం లేకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతోనే భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని అదీప్ రాజు స్పష్టం చేశారు. వైసీపీ నుండి తానే అభ్యర్థిని అని పునరుద్ఘాటించిన అదీప్ రాజ్, ప్రతిపక్షాల అభ్యర్థి ఎవరో ఇప్పటికీ వెల్లడి కాకపోవడం వారి అనైక్యతను తెలియజేస్తుందని ఎద్దేవా చేశారు.

కార్యక్రమంలో వైసిపి నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవీ సాంబ, పిఎసిఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, జెడ్పీటీసీ దేవి కనకరాజు, పార్టీ నాయకులు అన్నం రెడ్డి అజయ్ రాజ్, బైలపూడి భగవాన్, జైరాం, పైల శ్రీనివాసరావు, భోకం రామునాయుడు, గొర్లె రామునాయుడు, మెంట్ మహేష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ముఖ్యమైన కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మధుపాడ నాగమణి దంపతులు, జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు వంటి ప్రముఖులు లేకపోవడం చర్చనీయాంశమైంది.

## రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి

విశాలాంధ్ర - మల్కాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెబుతున్న బీజేపీ, వైసీపీలకు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఐ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో 63వ వార్డు పరిధిలో గల కాకరలోవ గ్రామం భగత్ సింగ్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. స్థానికులకే ఉపాధి అవకాశాలు ఇస్తానని తెచ్చిన జీవోను, కార్మికుల చట్టాలను తుంగలోకి తొక్కేశారన్నారు. ఈ రెండు ప్రభుత్వాలకు కమ్యూనిస్టు పార్టీలు, ప్రజలు సరైన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.కనకేశ్వరరావు, టి. కామేశ్వరరావు, నాయుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

## రూ.100 కోట్లతో గీతం "మూర్తి" పరిశోధనా కేంద్రాలు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రూ.100 కోట్ల రూపాయలతో విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో మల్టీడిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చి ఆన్ ట్రాన్స్‌లేషనల్ ఇనిషియేటివ్స్ (మూర్తి) పరిశోధనా కేంద్రాలను అభివృద్ధి చేస్తోందని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం పేర్కొన్నారు. గీతం మూర్తి పరిశోధన కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. గీతంలో పరిశోధకులుగా (పిహెచ్‌డి) ప్రవేశం పొందే వారిలో ప్రతిభ గలవారిని గుర్తించి మూర్తి ఫెలోషిప్‌ను సహితం అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 28వ తేదీన గీతం బెంగళూరు ప్రాంగణంలో మూర్తి పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ వెల్లడించారు. గీతం మూర్తి పరిశోధన కేంద్రం పరిశ్రమలతో కలసి వారి అవసరాలకు తగిన విధంగా 13 అంశాలపై పెద్దఎత్తున పరిశోధన ప్రయోగ శాలలు నెలకొల్పుతోందని తెలిపారు.

## రూ.15 కోట్లతో నిర్మించిన రైల్వే అండర్‌పాస్‌లు ప్రారంభం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పీఎల్‌పురం, నామవరం సమీపంలో సుమారు రూ.15 కోట్లతో నిర్మించిన రెండు రైల్వే అండర్‌పాస్‌లను ప్రారంభించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా సుమారు రూ.42వేల కోట్లతో దేశ వ్యాప్తంగా 554 రైల్వే స్టేషన్‌ల పునరాభివృద్ధి, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు/ అండర్‌పాస్‌లు నిర్మించారు. వీటిని ప్రధానమంత్రి నరేంద్రమోడి జాతికి అంకితం చేశారు. ఇందులో భాగంగా మండలంలో రెండు రైల్వే అండర్‌పాస్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, సర్పంచ్ వడాల సోమన్న దొర, సీఐ వి.అప్పలరాజు, ఎంపీడీఓ కె.స్వప్న, ఏఎస్ఐ గోవిందరావు, డిటి రాజేంద్ర ప్రసాద్, రైల్వే అధికారులు రవితేజ, మహమ్మద్ కెఎం వల్లి, రోజా, బి.శైలా సుధాకర్, కె.చిరంజీవి, డి.ఆనందరావు, రైల్వే బోర్డు సభ్యులు గట్టెం నానాజి, బోడపాటి శ్రీను, నాయకులు ఇసరపు తాతారావు, వల్యాల లచ్చబాబు, కురందాసు శివ, వేముల వెంకటేశ్వరరావు, కోనే రంగయ్య స్వామి, శ్రీరంగం రమేష్, ఆచంట శ్రీకాంత్, దాసరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ భవనం ప్రారంభం

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: సుజన కోట పంచాయతీ కేంద్రంలో నూతన సచివాలయ కార్యాలయాన్ని ఉమ్మడి జిల్లా చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సోమవారం ప్రారంభించారు. రూ.43 లక్షల 60వేల రూపాయల నిధులతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని స్థానిక సర్పంచ్ వి.రమేష్ ఆధ్వర్యంలో ఆమె సోమవారం కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ ఎ.సీతమ్మ, వైస్ ఎంపీపీ-2 ఎస్.భాగ్యవతి, స్థానిక ఎంపీటీసీ ఎం.సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ కె.కిరణ్ కుమార్, వైసీపీ మండల అధ్యక్షుడు వి.మల్లిఖార్జున్, వైసీపీ నాయకులు మూర్తి, జయదేవ్, సన్యాసి, దామోదరం, సచివాలయ సిబ్బంది సోమేశ్వరరావు, భాస్కరరావు, కళావతి, రాంప్రసాద్, కించయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో సోమవారం అమృత భారత్, సాకార భారత్ 1 రైల్వే అండర్ బ్రిడ్జిని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ రైల్వే విభాగాధిపతి పి.శ్రీనాద్ మాట్లాడుతూ దేశంలో అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడి ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు ప్రారంభించడం ఒక వరమని తెలిపారు. రైల్వే సామర్థ్యాల అభివృద్ధిపై దృష్టి సారించి రైల్వే లెవల్ క్రాసింగ్ తొలగింపునకు చర్యలు చేపట్టి నేడు ప్రజల కల సాకారమయ్యేలా చేశారన్నారు. కార్యక్రమంలో కాపు కార్పోరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పారావు, ఎంపిపి వై.రత్నం, నక్కపల్లి గ్రామ సర్పంచ్ నేతల జయరత్న కుమారి, ఎంఈవో కె.నరేష్, రైల్వే సిబ్బంది కె.సంతోష్, పి.రమేష్, వర్మ, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: గ్రామాల, ప్రజల, సర్పంచ్‌ల న్యాయమైన 16 డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పంచాయితీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఛాంబర్ అధ్యక్షులు వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్, వి.లక్ష్మీముత్యాలరావులు హాజరై ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినదాలు చేశారు. కాగా రాజ్యసభ సభ్యులు, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపి భీశెట్టి సత్యవతి కూడ కలెక్టర్‌ను కలవడానికి వచ్చి తిరిగి వెళ్తుండగా వారి కార్లు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా బైఠాయించారు. దీంతో సుబ్బారెడ్డి, అమర్‌నాథ్‌లు కారుదిగి వారి సమస్యలను విని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామని చెప్పడంతో అద్దుతప్పుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గడిచిన 3 సంవత్సరాలుగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగలేదని కనీస సౌకర్యాలు కూడ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికైన సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారని దీంతో ఓట్లు వేసిన ప్రజలు తిడుతున్నారని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా,చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా గ్రామ పంచాయితీలకు ఇవ్వాలసిన వాటా నిధులు ఇవ్వకపోగా స్థానిక ఆదాయ వనరుల ద్వారా వచ్చే నిధులను, కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం ఇస్తున్న 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దొంగలించిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న 12,918 గ్రామ పంచాయితీలోని 3.50 కోట్ల గ్రామీణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను తిరిగి పంచాయితీలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయితీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, ముత్యాలపాలెం సర్పంచ్ చింతల సుజాత ముత్యాలు, జిల్లాలోని పంచాయితీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

విశాలాంధ్ర - రాంబిల్లి: నావెల్ ఆల్టర్నేటివ్ బేస్ (ఎన్ఏఓబి) నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న ఎల్ అండ్ టి కంపెనీకి చెందిన కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలంటూ సోమవారం కార్మికులు భారీ ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఏఓబీ నుంచి రాంబిల్లి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం అందజేయడంతో పాటు పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.

## ఏఐటీయూసీ నేత రామకృష్ణ మాతృమూర్తికి నివాళి

విశాలాంధ్ర - గాజువాక: ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉక్కు గుర్తింపు యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ మాతృమూర్తి జమ్ముల దనమ్మకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్ర నాథ్, జి.ఓబులేసు తుళ్ళూరులో జె.రామ కృష్ణ స్వగృహంలో నివాళులు అర్పించారు. ఆమె సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కె.రాజ బాబు, నాయకులు ఏ.మసేఎన్.రావు, జి.ఆనంద్, అలమండ శ్రీని వాస్, ఆర్.దనరాజు, మూర్తి, బాబా, స్టీల్ హెచ్.ఎం.ఎస్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నియంత్రణకు కళాజాత

విశాలాంధ్ర - గొలుగొండ: అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం రామాలయం వద్ద బాలికలను రక్షిద్దాం బాలికలను చదివిద్దాం, బాల్య వివాహం నిర్మూలన అనే కార్యక్రమాన్ని కళా జాత నిర్వహించారు. ఐసీడీఎస్ ఏఎల్ పురం సెక్టర్ సూపర్వైజర్ సత్య శ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు గ్రామ సర్పంచ్ లోపల సుజాత, అంగన్వాడీ టీచర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చురుగ్గా సాగుతున్న పనులు

### విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానంలో ఇంజనీరింగ్ పనులకు "కనీస పర్యవేక్షణ కరువు" అనే శీర్షికతో విశాలాంధ్రలో వెలువడిన కథనానికి స్పందన లభించింది. ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు కాంట్రాక్టర్ సమక్షంలో పనులు చురుగ్గా చేయిస్తున్నారు. జనరల్ ఎన్నికల కోడ్ త్వరలో రానున్నట్లు తెలుస్తోంది. అందువలన శ్రీనివాసనగర్ వద్ద భవనం త్వరలో వర్చువల్ లేదా ప్రత్యక్షంగా ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. భవనానికి రంగులు, విద్యుత్, సిసి రోడ్లు, డ్రెయిన్లు, పార్కింగ్, ప్రధాన ద్వారం, కడప రాయి మెట్లు మొదలగు పనులు అధికారుల సమక్షంలో చురుగ్గా జరుగుతున్నాయి.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు

విశాలాంధ్ర - జి.మాడుగుల: గ్రామాల్లో ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దని సీఐ రమేష్ అన్నారు. సోమవారం బీరం పంచాయతీ వన్నల్బా గ్రామంలో సీఐ పర్యటించి మాట్లాడారు. ఊర్లో చిన్న చిన్న సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. యువత మద్యానికి బానిసై భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్లు, టీ షర్టులు పంపిణీ చేశారు.

## జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: ప్రభుత్వ శాఖ ఉద్యోగాల్లో గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్ కల్పించిన జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఒంటిపాక జంక్షన్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఒంటిపాక గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జీవో నెంబర్ 3తో పాటు ప్రత్యేక గిరిజన స్పెషల్ డీఎస్సీ భర్తీ చేయాలని ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విజయదుర్గ ఆలయానికి విరాళం

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయానికి బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ భారతీయ భాగస్వామి దొరస్వామి సొంత నిధుల నుంచి లక్ష 1,116 రూపాయలను విరాళంగా అందజేశారు. అమ్మవారి కరుణా కటాక్షాలు హరిపాలెం గ్రామస్తులందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీకాంతం సూర్యనారాయణ, ఉప సర్పంచ్ మారిశెట్టి వెంకట సీతారాం, ఎంపీటీసీ శరగడం లక్ష్మి, జ్యోతిర్మయి ప్రసాద్, అడ్వకేట్ శరగడం అప్పలనాయుడు, పెంటకోట నాయుడు పాల్గొన్నారు.

## గ్రావెల్ రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - చింతపల్లి: మారుమూల గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పిస్తున్న ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందని గొందిపాకల ఎంపీటీసీ సభ్యుడు తాంబేలి మోహన్‌రావు అన్నారు. రెండు కోట్ల 65 లక్షల రూపాయల నిధులతో సుమారు 5.8 కిలోమీటర్ల గ్రావెల్ రహదారి నిర్మాణ పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను వైసీపీ ప్రభుత్వంలోనే పూర్తి చేసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు సోమరాజు, బాలన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శరవేగంగా రహదారి పనులు



విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలో గల మారుమూల డెకపురం - పటక దవడ గ్రామాల రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వం సుమారు 2.5 కోట్లు ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. స్థానిక జెడ్పీటీసీ దీసరి గంగరాజు, హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం తదితరులు ఆయా గ్రామాలను సందర్శించి రహదారి నిర్మాణానికి నిధుల కోసం ఎంతగానో కృషి చేశారు. దీంతో ప్రస్తుతం పనులను గుత్తేదారు శరవేగంగా జరిపిస్తున్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన జడ్పీటిసి సభ్యుడు గంగరాజును పలువురు స్థానికులు అభినందిస్తున్నారు.

## సిద్ధం సభకు తరలివెళ్లిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: నియోజకవర్గంలోని ఎస్.రాయవరం మండలం, అడ్డురోడ్డు వద్ద నిర్వహిస్తున్న సిద్ధం బహిరంగ సభకు పాయకరావుపేట మండలంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు 150 ఆటోలు, మోటారు సైకిళ్లు, కార్లలో తరలి వెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ఆటోలన్ని సత్యవరం, నామవరం జంక్షన్ వద్ద చేరుకొని అక్కడి నుండి సిద్ధం సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటి విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, జడ్పీటీసీ లంకా సూర్యనారాయణ, జగతా శ్రీను, కొంతం నరేష్, పన్నీరు పాపారావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, కోడా కోటేశ్వరరావు, యజ్జల సత్యనారాయణ, దేవ వరపు రాజేష్ఖన్నా, దేవవరపు వెంకటేశ్వరరావు, వంగలపూడి రామారావు, నీలాపు బాలకృష్ణారెడ్డి, పల్లెల వెంకట్, తూము రాజబాబు, గుజ్జు గోవిందరెడ్డి, పాలపర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీని వాసరావు, ధనిశెట్టి బాబూరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు సిద్ధం సభకు తరలివెళ్లారు.

## అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొంటే విధుల నుంచి తొలగిస్తాం

విశాలాంధ్ర - సీలేరు: ఏపీ జెన్కో ఉద్యోగులు అసాంఘీక కార్యకలాపాల్లో పాల్గొంటే విధులు నుంచి తొలగిస్తామని ఏపీ జెన్కో విజిలెన్స్, సెక్యూరిటీ విభాగం(విద్యుత్తు సౌదా) డీఎస్పీ చిరంజీవి అన్నారు. ఏపీ జెన్కో కళ్యాణమండపంలో ఏపీ జెన్కో ఉద్యోగులు, అధికారులు, సెక్యూరిటీ సిబ్బందితో నిర్వహించిన అవగాహన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధరబాబు సీలేరు కాంప్లెక్స్‌లో జరుగుతున్న పరిణామాలపై ప్రత్యేక దృష్టిసారించారని, ఈ నేపథ్యంలో ఉద్యోగులకు అవగాహన నిర్వహించమని ఏపీ జెన్కో ఎస్పీ పనసారెడ్డి ఆదేశాలు జారీ చేశారని, ఈ మేరకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసామని ఆయన అన్నారు. ఉద్యోగులు తమ పరిధిలో విధులు నిర్వహించాలని, అసాంఘీక కార్యకలాపాలకు జోలికి పోవద్దని, ముఖ్యంగా గంజాయి సాగు, రవాణాలో పాలుపంచుకోవద్దని, తక్కువ వ్యవధిలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో చెడుదారులకు కొంతమంది జెన్కో ఉద్యోగులు వెళుతున్నారని, ఇది సరైన పరిణామం కాదని, ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొంటే విధులు నుంచి తొలగిస్తామని డీఎస్పీ చిరంజీవి హెచ్చరించారు.

అనంతరం ఏపీ జెన్కో ఎఎస్వో సూర్యమోహన్ ఎన్‌డీపీఎస్ చట్టం పై అవగాహన కల్పించారు. ఈ కేసులు నమోదు అయితే ఉద్యోగ పరంగా ఎదురయ్యే చిక్కులు వివరించారు. ఈ సందర్భంగా మేము ఎవ్వరికి తెలియకుండా ఈ దందా చేస్తున్నాము అనుకున్నవారిని మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా అరెస్ట్ చేసారో కేసులు వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ కెకెవి ప్రశాంత్‌కుమార్, ఈఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - ఎలమంచిలి: రాష్ట్రంలో రైల్వే స్టేషన్‌ల రోడ్లకి కేంద్ర ప్రభుత్వం 3,150 కోట్లు నిధులతో అభివృద్ధి పనులు చేపట్టిందని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. సోమవారం దేశ ప్రధాని నరేంద్ర మోడి దేశవ్యాప్తంగా 554 రైల్వేస్టేషన్లో అభివృద్ధి పనులను శంకుస్థాపన, పూర్తయిన వాటికి వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో 13 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ అహమ్మద్ అలీ ఖాన్‌కు పెద్దపల్లి, వైఎస్ఆర్ కాలనీ, టిట్కో జిల్లా సముదాయ వాసులు తమకు అండర్ గ్రౌండ్ వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధి కారులు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జనసేన నాయకులు విజయ్ కుమార్, ఎంపీపీ గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేపు గుప్తా, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఎర్రయ్య దొర తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

### సర్పంచ్ గారా కృష్ణప్రసాద్



విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలోని సర్వే నెంబర్ 17/1లో ఉన్న భూమిని ఇటీవల ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బోర్డులు ఏర్పాటు చేసిందని, ఆభూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని శ్రీరాంపురం గ్రామ సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్ఐ త్రినాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గారా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సర్వే నెంబరు 17/1లో ఉన్న ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయగా కొందరు తొలగించారని, వీటిపై రెవెన్యూ, పోలీసులు ఫిర్యాదు చేసినా నేటికి చర్యలు తీసుకోలేదన్నారు. బోర్డులు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని, అక్కడ ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్న వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు జి.వెంకన్న, డి.కృష్ణ, మత్తిన నరసింహమూర్తి, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అవతార్ మెహర్ బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి



విశాలాంధ్ర - చింతపల్లి: అవతార్ మెహర్ బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని అవతార్ మెహర్ బాబా ఆలయ కమిటీ సభ్యురాలు కోరాబు కొండమ్మ (శాంతి ప్రసాద్) అన్నారు. అవతార్ మెహర్ బాబా ఆలయానికి సోమవారం విచ్చేసిన ఆమె మెహర్ బాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవతార్ మెహర్ బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. ఎల్లవేళలా బాబా తమకు అండగా ఉండబట్టే ఆరోగ్య రీత్యా ఎన్ని సమస్యలు తలెత్తినా, ఆర్థికంగా ఇబ్బందులు చుట్టుముట్టినా బాబా ఆశీస్సులతో బయటపడ గలుగుతున్నామని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆమెతోపాటు తన కుమారుడు రాహుల్ కాసు కూడా అవతార్ మెహర్ బాబాను దర్శించుకున్నారు.

## దళితుల ఆదివాసీల సమస్యలపై స్పందించండి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి మండలం పాపయ్య సంతపాలెం పంచాయతీ పరిధిలో దళితుల 25 ఎకరాల భూమిని జగనన్న కాలనీ నిమిత్తం 2019లో తీసుకొని వారికి ఎల్‌పీసీలు ఇచ్చి నేటికీ భూమి ఎక్కడుందో చూపించలేదని ప్రభుత్వ అధికారులు చుట్టూ తిరుగుతున్న ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడంతో డివిఎం సభ్యులు రేబాక మధుబాబుని కలిసి సమస్య తెలియజేశారు. దీనిపై స్పందిస్తూ స్పందనలో జెసిని బాధితులతో కలిసి సమస్యలను మధుబాబుకు విన్నవించారు. అలాగే రోలుగుంట మండలం శరభ వరం గ్రామం రాజన్నపేట నివాసులు డ్వాక్రా గ్రూపు సభ్యులు రెండో విడత ఆసరా నగదు మా ఖాతాల్లో జమ అవ్వలేదని ఆ డోక్రా గ్రూపు వారు మమ్మల్ని ఆశ్రయించారని దానిపై కూడా తమరు స్పందించి న్యాయం చేస్తారని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం .సుదర్శన్ కే. శామ్యూల్ ఎం. శ్రీనివాసరావు ఎం. రాజశేఖర్ ,పల్లికొండ వరప్రసాద్ ,మట్ట ఉదయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ముద్దాయికి రిమాండ్

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మండలంలోని తాడేపల్లి గ్రామానికి చెందిన కత్తుల లక్ష్మిని తన భర్తే హత్య చేసి దాన్ని పిట్స్‌గా సృష్టించి చేసిన నేరం నుంచి తప్పించుకోవటానికి తన భర్త కత్తుల భూమా రెడ్డి భార్య తలకు తగిలిన గాయంతో ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ మేరకు డాక్టర్లు ఇచ్చిన రిపోర్ట్ ద్వారా పోలీసులు తమదైన పద్ధతిలో విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. భార్య భర్తల మధ్య జరిగిన గొడవలో తలకు తగిలిన గాయంతో మృతి చెందినట్టు విచారణలో తేలింది. దీంతో సదరు నిందితుడు భూమారెడ్డిని సోమవారం కోర్టులో హాజరు పరచగా నేరం రుజువు కావటంతో ముద్దాయికి రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఎస్సై సిబ్బంది పాల్గొన్నారు.

## అయోధ్యలో ప్రదర్శనకు నిర్మల నృత్యనికేతన్ విద్యార్థులు

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రఖ్యాత నృత్య కళాశాల, జీవీఎంసీ 97వ వార్డు చిన్న ముసిడివాడ వద్ద గల నిర్మల నృత్యనికేతన్ విద్యార్థులు అయోధ్యలో నృత్య ప్రదర్శనకు పయనమవుతున్నారు. ఇప్పటికే దేశ విదేశాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చి పేరు ప్రఖ్యాతులు గడించిన విద్యార్థులు దేశంలోని ప్రముఖ దేవాలయాలు అన్నింటిలోనూ నృత్య ప్రదర్శనలు ఇస్తున్నారు. ఈ క్రమంలో అయోధ్యలో ప్రదర్శనకు తమ విద్యార్థులకు అవకాశం లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ జ్యోతి తెలియజేశారు. ఈ నెల 28న ప్రత్యేక రైలులో 20 మంది విద్యార్థులు అయోధ్యకు బయలుదేరి వెళుతున్నారని ఆమె చెప్పారు.

## మార్చి 3న పల్స్ పోలియోను విజయవంతం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో మార్చి 3వ తేదీన ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు వేసే పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ జీవీఎంసీ ప్రజారోగ్యం అధికారులను ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్ లో డిఎంఅండ్‌హెచ్ జి.జగదీశ్వరరావు, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్లు, యు.పి.హెచ్.సి అధికారులతో మార్చి 3వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో 8 జోన్లో ఉన్న 72 యు.పి.హెచ్.సి లలోను 813 బూతులలో 36 ట్రాన్సిట్స్ లను ఉపయోగించి ఐదు సంవత్సరాలలోపు 1,17,687 మంది చిన్నారులకు మార్చి 3వ తేదీన ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

## రోడ్లపై వ్యర్థాలు లేకుండా పరిశుభ్రపరచండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో ప్రధాన రహదారులు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ప్రజారోగ్యపు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జోన్-3, 5 పరిధిలోని 26, 14, 45, 48, 49, 50, 51 వార్డుల పరిధిలోని అక్కయ్యపాలెం, లలితా నగర్, నరసింహ నగర్, కైలాసపురం గిరి ప్రదర్శన రోడ్డు, మాధవధార, మురళి నగర్ నేషనల్ హైవే, తాటిచెట్ల పాలెం, గ్రీన్ బెల్ట్ తదితర ప్రాంతాలలోని రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారులు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించామని తెలిపారు. లలితనగర్ లో వసుంధర క్యాస్టల్ అపార్ట్మెంట్ వద్ద రోడ్డుపై వ్యర్థాలు ఉండడం గమనించి ఆ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, క్లాప్ వాహనాల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్నప్పుడు రోడ్లపై వ్యర్థాలు ఎందుకు ఉన్నాయని ఆరా తీశారు. తడి పొడి, హానికర వ్యర్థాలు ఇంటి వద్దే వేరు చేసి క్లాప్ వాహనాలకు అందించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు ఎవరికి నిర్దేశించిన ప్రదేశాలలో వారిని తప్పకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. క్లాప్ వాహనాలు నిర్దేశిత సమయానికే ఇంటింటి నుండి వ్యర్థాలను సేకరించే విధంగా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను, ఎ.ఎం.ఒ.హెచ్.లను ఆదేశించారు. ఎంతో మంది పర్యాటకులు నగరానికి విచ్చేస్తున్నందున ముఖ్యంగా నగరంలోని ప్రధాన రహదారులు పరిశుభ్రంగా ఉండే విధంగా ఎప్పటికప్పుడు పారిశుద్ధ కార్మికులచే వ్యర్థాలను తొలగించాలని, రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆయా ప్రాంత శానిటరీ ఇన్స్పెక్టర్లను కమీషనర్ ఆదేశించారు

## ముస్లిం దూదేకుల సంక్షేమ సేవా సంఘం భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 96వ వార్డు ద్రోణంరాజు నగర్ నందు నూతనంగా నిర్మించ తలపెట్టిన నూర్ భాషా బిసి ముస్లిం దూదేకుల సంక్షేమ సేవాసంఘ కార్యాలయం భవనానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. సోమవారం ఉదయం స్థానిక శాసనసభ్యుడు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముస్లిం సంప్రదాయ అనుసారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కార్యక్రమ నిర్వాహకులు తమ సాంప్రదాయ రీతిన ఘనంగా సత్కరించారు. అనంతరం సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్ తమ సంఘానికి అందిస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. త్వరలో వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న మసీదులు భవన సముదాయాలు ప్రారంభోత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కిల్లి అప్పారావు, లెక్కల రమేష్, సిరికి దేవుడు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ, సంఘం ప్రతినిధులు ,షేక్ వీర్ సాహెబ్, షేక్ ఖాన్ సాహెబ్, షేక్ సాహుల్, సాదన్ ఇస్మాయిల్, అబ్దుల్లా, మదీనా, భాష, రెహమాన్, మున్నా, సాదిక్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో న్యాయవాది బూర్జ ప్రేమ్ చంద్ మృతి

విశాలాంధ్ర - అరకులోయ: అరకులోయ పట్టణంలోని పాత పోస్ట్ ఆఫీస్ కాలనీలో నివాసం ఉంటున్న న్యాయవాది బూర్జ సింహాచలం కుమారుడు బూర్జ ప్రేమ్ చంద్ సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. తండ్రి సింహాచలం న్యాయవాది వృత్తిలో ఉంటూ తన పిల్లలకు న్యాయమూర్తులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో తన పెద్ద కుమార్తె అయిన ప్రియాంక, మరియు మృతుడు ప్రేమ్ చంద్ కు బి ఎల్ చదివించి న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేయించారు. ప్రేమ్చంద్ హఠాత్ మరణంతో కుటుంబీకులు బంధుమిత్రులు దిబ్బాంతికి గురయ్యారు. కుటుంబ పరంగా పాడేరు ఏజెన్సీలో సింహాచలం కు ఉన్న సత్సంబంధాల తో ప్రేమ్చంద్ మృతితో విషాద ఛాయలు అలముకున్నాయి మంగళవారం ఉదయం 10 గంటలకు అరకులోయలోని ఏరియా ఆసుపత్రి సమీపంలో బరియల గ్రౌండ్ వద్ద దాన సంస్కరణలు జరపనున్నట్లు తండ్రి సింహాచలం తెలిపారు. మృతుడు ప్రేమ్ చంద్ అరకులోయ లో అందరికి సుపరిచితుడు కావడం, అందరితో కలివిడిగా గుణం కలిగిన ఉన్న వ్యక్తి కావడంతో స్నేహితులు, బంధుమిత్రు మరణ వార్త విని జీర్ణించుకోలేక పోతున్నారు.

## వైమానిక కార్యకలాపాల్లో భారత నావికాదళం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భారత నావికాదళం అరేబియా సముద్రం మీదుగా వైమానిక చొప్పించే కార్యకలాపాలను నిర్వహిస్తుంది. గల్ఫ్ ఆఫ్ అడెన్ అరేబియా సముద్రంలో కొనసాగుతున్న సముద్ర భద్రతా పరిస్థితులకు ప్రతిస్పందనగా ఏదైనా సముద్ర ముప్పుపై తక్షణ చర్యను నిర్ధారించడానికి, భారత నావికాదళం అరేబియా సముద్రంలో సి-130 విమానాల నుండి గాలితో కూడిన క్రాఫ్ట్‌లు, మార్కోలను పారాడ్రాప్ చేయడం ద్వారా ప్రత్యేక దళాలను గాలిలో చేర్చడం ప్రారంభించింది. ఈ ప్రాంతంలో పైరసీ వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగించింది. భారతీయ నౌకాదళం ఈ ప్రాంతంలోని మర్చంట్ షిప్పింగ్ నావికుల భద్రత పట్ల కట్టుబడి ఉంది.

## వేపగుంటలో వికసిత భారత్ సంకల్ప యాత్ర

విశాలాంధ్ర - పెందుర్తి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జీవీఎంసీ 94 వార్డు వేపగుంటలో సోమవారం ఉత్సాహంగా జరిగింది. పలు శాఖల అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వాటి ద్వారా ప్రయోజనం పొందాలని ప్రజలకు సూచించారు. పలువురు గర్భిణీ స్త్రీలకు సీమంతాలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం అందించక కానుకలను పంపిణీ చేశారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ను తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యం కోసం అందరూ పాటుపడాలని భారతీయ జనతా పార్టీ విస్తారక్ అప్పారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### రీసెర్చ్ ఆర్టికల్స్‌లో

## అపోలో వైద్యులు అబ్దుల్ డి ఖాన్‌కు ప్రత్యేక గుర్తింపు

### -యూరోపియన్ సదస్సులో మే నెలలో ప్రదర్శన

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జర్మనీలోని హాంబర్గ్ లో జరగనున్న ఈ ఏడాది మే నెలలో జరుగనున్న ఎఫోర్ట్ వార్షిక సదస్సులో మౌఖిక ప్రదర్శన కొరకు 2 శాస్త్రీయ కథనాలు ఆమోదించబడ్డాయి. ప్రతిష్టాత్మక ఎఫోర్ట్ (యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ఆర్థోపెడిక్ అసోసియేషన్స్ ఇన్ ఆర్థోపెడిక్స్ ట్రామాటాలజీ) వార్షిక సదస్సులో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ హెడ్ ఆఫ్ థ డిపార్ట్మెంట్ డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ సమర్పించిన 2 సైంటిఫిక్ రీసెర్చ్ ఆర్టికల్స్ సమర్పించబడ్డాయి. యూరోపియన్ వార్షిక సదస్సులో ప్రెజెంటేషన్ కోసం 2 శాస్త్రీయ కథనాలు ఆమోదించబడటం విశాఖ అపోలో లో పనిచేస్తున్న వైద్యునికి దక్కిన అరుదైన గౌరవంగా నిలిచిపోనుంది.దీనికి సంబంధించి ఎఫోర్ట్ కాన్ఫరెన్స్ సైంటిఫిక్ కమిటీ ఒక లేఖను పంపించడం జరిగింది. శాస్త్రీయ కథనాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటిసారిగా డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ చేసిన అరుదైన శస్త్రచికిత్స ఉంది. ఆయన హగ్లండ్స్ వైకల్యం కోసం హిండ్ ఫుట్ ఎండోస్కోపిక్ కాల్కానియోప్లాస్టీని చేశారు. దీనితో రోగి మంచి ఫంక్షనల్ రికవరీని కలిగిఉన్నట్లు పేర్కొన్నారు.వీటికి సంబంధించిన, వృద్ధుల తుంటి పగుళ్లపై 48 గంటలలో చేసిన శస్త్ర చికిత్సలకు సంబంధించి శాస్త్రీయ కథనాలు ఆమోదించబడటంతో ఆసుపత్రి వర్గాలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## టీడీపీ శంఖారావం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డులో శంఖారావం కార్యక్రమంను సోమవారం 138, 118,119లో నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు మధు సోమేష్, మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీ లక్ష్మీ బూత్ కన్వీనర్ పోతిన తేజ తదితరులు పాల్గొన్నారు.

## డీటీ శ్యామ్‌కు సత్కారం

విశాలాంధ్ర - యస్.రాయవరం: డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న శ్యామ్‌ను మండల అధికారులు ఘనంగా సత్కరించారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు రెండు రోజుల క్రితం జిల్లాలో డిప్యూటీ తహశీల్దార్‌లను బదిలీ చేసిన సందర్భంగా శ్యామ్‌కు నర్సీపట్నం బదిలీ జరిగింది. దీంతో సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీడీవో కే.సత్యనారాయణ మూర్తి, ఈవోపిఆర్‌డి సత్యనారాయణ, మండల సర్వేయర్ త్రిమూర్తి, తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పులి సత్తిబాబును పరామర్శించిన అనిత

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఎస్.రాయవరం జనసేన నాయకుడు పులి సత్తిబాబును టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పరామర్శించారు. ఇటీవల పులి సత్తిబాబు తల్లి అయిన కాసులమ్మ మృతి చెందడంతో ఆయనను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, టిడిపి సీనియర్ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, సోమిరెడ్డి రాజు, బత్తుల వాసు, జనసేన సీనియర్ నాయకులు సేనాపతి బాబురావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో సోముదేవుపల్లి , భీమవరం, దార్లపూడి గ్రామాలకు మధ్యలో ఉన్న రైల్వే గేట్ వద్ద నూతనంగా నిర్మించిన అండర్ పాస్ బ్రిడ్జిను ప్రారంభించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ గేటుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేసిన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ బ్రిడ్జిలు నిర్మించారు. ఢిల్లీ నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశం మొత్తం వర్చువల్ విధానంలో బ్రిడ్జిలను ప్రారంభించారు. ఇక్కడ పద్మశ్రీ ఏటికొప్పాక బొమ్మల కళాకారుడు చింతలపాటి వెంకటపతి రాజు చేతుల మీదుగా శిలాఫలకంను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దార్లపూడి సర్పంచ్ సుభాషిని, ఎంపిటిసిలు దేవుడమ్మ, అప్పయ్యమ్మ, రైల్వే ఏ డి ఎస్ ఐ ఈ బ్రహ్మాజీ, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై చోడి పిండి మిల్లుల అందజేత

విశాలాంధ్ర - ముంచంగిపుట్టు: మండల పరిధిలో గల ఐదుగురు లబ్ధిదారులకు సోమవారం చోడి పిండి మిల్లులను మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస బాబు ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర చేతుల మీదగా రైతులకు పంపిణీ చేశారు. ఐదుగురి లబ్ధిదారులలో వనుగుమ్మ పంచాయతీ నుంచి ఇద్దరికీ, జర్జుల పంచాయితీ నుంచి ఒకరికి బంగారు మెట్ట పంచాయతీ నుంచి ఒకరికి, బరడా పంచాయతీ నుంచి ఒకరికి రాయితీపై వచ్చిన చోడి పిండి మిల్లులను పంపిణీ చేశారు. అశ్వశక్తి 2 హెచ్పి ధర 19000 ఉండగా రాయితీపై 9500లకు, అలాగే అశ్వ శక్తి 3 హెచ్పి ధర 24,500 ఉండగా 12,250కు రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, వైసిపి మండల అధ్యక్షులు మల్లికార్జున్, వైసిపి సీనియర్ నాయకులు జగబంధు, జయదేవ్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## అవతార్ మెహర్ బాబా జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర - పద్మనాభం: అవతార్ మెహర్ బాబా 130వ జయంతోత్సవాలు రెడ్డిపల్లి గ్రామంలో ఘనంగా జరిగాయి. ఈ జయంతోత్సవాలకు అవతార్ బాబా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అవతార్ బాబా నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 3 వేల మందికి అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో పద్మనాభం మండలం ఎంపీపీ కే రాంబాబు పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అవతార్ బాబా భక్తులు, సేరికాండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు, నమ్మి వెంకటరావు, రిటైర్డ్ ఎండిఓ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి

విశాలంధ్ర - అచ్యుతాపురం : క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ హెడ్ ఇంజరస్ ఫౌండేషన్, హీరో మోటార్ కంపెనీ వారి సహకారంతో సోమవారం తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలలో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ క్యాంపు నిర్వహించారు. పాఠశాలలో 30 మందికి పిల్లలకు హెల్మెట్లను సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి శివ బాపునాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులకే కాకుండా పిల్లలు కూడా హెల్మెట్లు ధరించి ప్రయాణం చేయాలని, రోడ్ సేఫ్టీ నియమాలు పాటించాలన్నారు. సంస్థ కార్యదర్శి మల్ల నాగేశ్వరావు మాట్లాడుతూ సంస్థ తరపున రోడ్ సేఫ్టీ అవేర్నెస్ క్యాంపు విశాఖపట్నం అర్బన్ అనకాపల్లి అర్బన్ ఏరియాలో ఐదువేల మంది పిల్లలకి హెల్మెట్స్ డిస్ట్రిబ్యూట్ చేయాలని, 15000 మంది పిల్లలకి అవేర్నెస్ క్యాంపు చేయాలని ప్రణాళికని రూపొందించామన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు మారిశెట్టి వెంకట అప్పారావు, తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర - చింతపల్లి : తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గం లో నిర్వహిస్తున్న నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించబోతున్న నిజం గెలవాలి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్న శుభ సందర్భంగా పురస్కరించుకొని ఆ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మండలంలో బీజేపీ పోరు యాత్ర

**విశాలాంధ్ర - జిమాడుగుల :** మండలంలోని నిట్టపుట్టు, సీకుంబంధ, ఏడు చావడ్లు, గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షులు నూకరాజు ఆధ్వర్యంలో సోమవారం ప్రజా పోరు యాత్ర -2 నిర్వహించారు. బీజేపీ గిరిజన మోర్చా మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ శ్రీ మతి కురుస పార్వతమ్మ ముఖ్య అతిధిగా పాల్గొని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పధకాలను ప్రజలకు వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రజలకు అందించడం లో విఫలం అయినా వైస్సార్సీపీ ప్రభుత్వం వైపల్యాలను ఎండగట్టారు, దేశంలో రాష్ట్రం లో బీజేపీ సర్కార్ ఉంటేనే అభివృద్ధి సాధ్యం అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయ కులు కోటారి పార్వతమ్మ, సాగెని సింహచలం, సాగెని చిరంజీవి,

గండేరు లక్ష్మణ చారి, సుబ్బారావు, గణేష్, గిరిజన ప్రజలు, యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భావితరాల భవిష్యత్తు జగన్మోహన్ రెడ్డి ...భరత్‌ను గెలిపించే బాధ్యత మీదే

### అనకాపల్లి సిద్ధం సభలో వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

**విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి :** భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, రానున్న ఎన్నికలు దోపిడీ దొంగలకు సామాన్యులకు మధ్య జరగనున్నాయని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో గల రావు గోపాలరావు కళాక్షేత్రంలో అనకాపల్లి సిద్ధం సభ, నియోజకవర్గ వైసిపి కార్యకర్తలు విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాటా డుతూ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎంత పెద్ద ఎత్తున జరిగాయో ప్రజలు గమనించారని, ప్రతిపక్షాలు మాత్రం ఈ పథకాలపై దుష్ప్రచారం సాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను ఏదో విధంగా మభ్యపెట్టి ఓట్లు రాబట్టుకోవాలని చూస్తున్న ప్రతిపక్షాల ఆటలు సాగవని తిరిగి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఇందుకు పార్టీ శ్రేణులన్నీ శ్రమించాలని ఆయన సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ పేరుతో నిధులను స్వాహా చేసి జైలుకు వెళ్లిన చంద్రబాబును ప్రజలు నమ్మరని ఆయన అన్నారు. రానున్న ఎన్నికల్లో అనకాపల్లి నియోజకవర్గం నుంచి భరత్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంత్రి అమర్నాథ్‌కి తగిన గౌరవమే లభిస్తుంది. ఇదిలా ఉండగా పరిశ్రమల శాఖ

మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను వైవి సుబ్బారెడ్డి ప్రశంసలతో ముంచెత్తారు. అమర్నాథ్ అంటే జగన్మోహన్ రెడ్డికి అత్యంత ఇష్టమని, 2014లో అనకాపల్లి పార్లమెంటరీ నియోజక వర్గం నుంచి పోటీ చేయమని ప్రోత్సహించింది జగన్మోహన్ రెడ్డే అని, 2019లో అనకాపల్లి నియోజక వర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించడంతో పాటు మంత్రిని చేసి, అమర్నాథ్ పట్ల ఉన్న అభిమానాన్ని చాటు కున్నారని సుబ్బారెడ్డి చెప్పారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత అభిమాన పాత్రుడైన అమర్నాథ్కు డిప్యూటీ పదవి ఇచ్చి అభ్యర్థులను గెలిపించే బాధ్యతను అమర్నాథ్కు అప్పగించారంటే ఆయనపై జగన్మోహన్ రెడ్డికి ఉన్న నమ్మకం ఏమిటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ భీమిలి, దెందులూరు, రాప్తాడు సిద్ధం సభలకు వచ్చిన జనాన్ని చూసి ప్రతిపక్షాలకు మతిభ్రమించిందని, ఈ సభల ద్వారా పార్టీ శ్రేణులంతా ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకువస్తామంటూ భరోసా కల్పించారని అన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా అనకాపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి వేధింపులు, కష్టాలు లేకుండా సుపరిపాలన సాగిందని, ఇదే రకమైన పరిపాలన కొనసాగాలంటే మళ్ళీ అనకాపల్లిలో వైసిపి అభ్యర్థిని గెలిపించాలని మంత్రి అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్ అనకా పల్లిలో సభ నిర్వహించలేక నాగుల పల్లిలో ఏర్పాటు చేసుకున్నాడు అంటే ఆ పార్టీ ఎంత దయనీయ పరిస్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అమర్నాథ్ వ్యాఖ్య నించారు. ఫ్యాన్ ఇంట్లో ఉండాలి, గ్లాస్ సింక్ లో ఉండాలి. అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుకే ఓటెయ్యాలి అని అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు, అనకాపల్లి నియోజకవర్గ సమన్వ యకర్త భరత్, అనకాపల్లి ఎంపీ బీసెట్ వెంకట సత్యవతి, రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు అధ్యక్షత వహించగా, వైఎస్ఆర్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఈ సమావేశాన్ని ప్రారం భించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ రాక...

**విశాలాంధ్ర బ్యూరో - విశాఖ పట్నం :** విశాఖ పట్నం ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో జరుగు "భారత్ రైజింగ్" సదస్సుకు ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ వస్తున్న సందర్భంగా సభా ప్రాంగణాన్ని పోలీస్ సిబ్బంది, ఎస్ పీజీ గ్రూపు అధికారులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పివియన్ మాధవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉన్న డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు , మేదావులు ఉదయం 11 గంటలకు ముందుగా సభా ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు.కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఉదయం 11 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టు నుండి ఉడా చిల్డ్రన్ థియేటర్‌కు వచ్చి, సదస్సు అయిన వెంటనే విశాఖ విమా నాశ్రయం నుండి విజయవాడ వెళ్తారని తెలిపారు. అనంతరం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపు సిబ్బంది,పోలీస్ సిబ్బంది క్షుణ్ణంగా పరిసరాలు పరిశీలించి రూట్ మ్యాప్ గుర్తించారు.ఈ కార్యక్రమంలో సిటీ ఎసీపీ జయరాం ప్రసాదు,విశాఖ పార్లమెంట్ కన్వీనరు రామ్మోహన్, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రకాశ్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శులు దామోదర్ యాధవ్, పొలిమేరు శ్రీను, దిలీప్ వర్మ, దానేష్ ,ఏపీ మీడియా కోర్డినేటర్, జిల్లా అధికార ప్రతినిధి వెన్నాశ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ - జనసేన పొత్తుతో వైసీపీలో వణుకు..

### ఎమ్మెల్సీ వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్

**విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం :** టీడీపీ జనసేన అభ్యర్థులు ప్రకటన తో తాడేపల్లి ప్యాలెస్ లో వణుకు మొదలైందని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అన్నారు సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కొంత మంది మంత్రులు మా పొత్తు లు గురించి మాట్లాడు తున్నారంటే భయప డుతున్నారని అర్థం అవుతుందన్నారు. కాపు లు అమాయకులు అని ఒక మంత్రి అంటున్నారని, మీకు త్వరలోనే చూపిస్తారని, వారు తెలివైన వారా అమాయకులో అర్థమవుతుందన్నారు. పవన్ కళ్యాణ్‌ని వ్యక్తి గతంగా మాట్లాడి ఇబ్బందులు పెడుతున్నారని, కాపు లు అంతా డిసైడ్ అయ్యారని పవన్ కళ్యాణ్ ని చూసి మాత్రమే ఓటు వేస్తారన్నారు. తక్కువ సీట్లు అంటున్నారని, సీట్లు పై పవన్ కళ్యాణ్ కి క్లారిటీ వుందన్నారు. సీట్లు రాకపోయినా పవన్ కళ్యాణ్ వెంటే వుంటామని జన సైనికులు చెబుతున్నారని, కాపు కార్పొరేషన్ కి ఎన్ని నిధులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలుకి పెద్ద పీఠ వేశాం అని చెప్పడం దారుణమని, 56 కార్పొరేషన్‌లుకి ఒక్క రూపాయి ఇచ్చారా అన్నారు. చైర్మన్ పదవులు మాత్రమే ఇచ్చారని, యాదవ కార్పొరేషన్ బిల్డింగ్ ప్రారంభోత్సవం కి వచ్చిన మంత్రి బీసీ లు కి ఏదో చేశాం అని చెబుతున్నారన్నారు. శంకుస్థాపనకు యాదవ కార్పొరేషన్ చైర్మన్‌ని పిలిచారా? ఆయన ఎందుకు రాలేదన్నారు. ఆయన భయపడి రాలేదని, ప్రజలు అడిగితే సమాధానం చెప్పలేక రాలేదన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నన్ను వ్యక్తి గతంగా విమర్శిస్తున్నారని, చేపల పులుసు పెట్టి మంత్రి అయ్యావని, అమ్మ గారు కి చేపల పులుసు ఇష్టం అన్న చేపల పులుసు మంత్రి నువ్వు పార్టీ కి ఏమి చేశావు అన్నారు. ఎంపీ ఎంవీ వి కోటి రూపాయలు ఇస్తాను అన్నాడని, అతను ఇచ్చినా యాదవులు తీసుకోరని, కార్పొరేషన్ కట్టిస్తుందని, ప్రభుత్వం డబ్బు తో కట్టి ఇవ్వాలని, లేదంటే మేమే కట్టు కుంటాం అన్నారు. 29 తేదీ తర్వాత సీట్లు పై పూర్తి స్పష్టత వస్తుందన్నారు. ఈ మీడియా సమావేశంలో జనసేన నేతలు ఉషా కిరణ్, కందుల నాగరాజు, బీసెట్టి వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి అన్యా క్రాంతం..

**విశాలాంధ్ర - గొలుగొండ :** గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ అయినా ఏ ఎల్ పురం గ్రామంలో శిరిడి సాయి గుడిని ఆనుకొని ఉన్న లక్షల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 132 పేరుతో ఉన్న ఈ భూమిని ఇళ్ల స్థలాల పేరుతో దౌర్జన్యంగా గ్రామస్తులు కబ్జా చేసి ఇళ్ల స్థలాలకు ప్లాట్లు వేసి మట్టిని చదును చేస్తున్నారు. ఈ విషయం సంబంధిత రెవెన్యూ అధికారులకు తెలిసిన చూచి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి ఎవరైనా అడిగితే ఆ స్థలం గుడికి చదును చేస్తున్నారని అంటున్నారని అయితే సంబంధిత అధికారులు గుడికి కేటాయించారో లేదో తెలియ రాలేదని పలువురు వ్యాక్యానిస్తున్నారు ఇదంతా రాజకీయ నాయకులు గ్రామంలో ఉండే పెద్దలు కొందరు వారికి అనుకూలంగా ఉండే వ్యక్తులకు అప్పగించేందుకే గుడి పేరుతో స్థలాన్ని కబ్జా చేస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి . మట్టితో కప్పుతున్నారని విషయం రెవెన్యూ అధికారులకు తెలిసిన ఈ కారణం చేత మరి తెలియదు కానీ వారు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అర్హులు కాకపోయినా పార్టీలకు అనుకూలంగా ఉండే వ్యక్తిలు అయితే చాలు ఎలాంటి ప్రదేశాలైన అప్పనంగా కట్టబెట్టేందుకు నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారని తెలుస్తోంది ఏ ఎల్ పురం లో ఇప్పటికే కోట్లాది రూపాయలు విలువచేసే భవంతులు ఉన్నవారికి మూడు అంతస్తులు అలాగే రెండు మూడు ఇల్లులు ఉన్నవారికి ఇళ్ల స్థలాలు ఇల్లు ఇచ్చారు తప్పితే అసలైన లబ్ధిదారులకి ఇక్కడ ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపణలు ఎప్పటినుండో ఇక్కడ వినిపిస్తున్నాయి ఎలక్షన్ సమయం దగ్గరకు వచ్చే సమయానికి ప్రభుత్వ భూములను పార్టీ కార్యకర్తలకు అప్పగించే ఆలోచనలో నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది

## శ్రీ లక్ష్మీ గణపతి ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

### ఆయల కమిటీ

**విశాలాంధ్ర - మల్కాపురం :** పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం 60 వ వార్డు అశోక్ నగర్‌లో గల శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం అభివృద్ధికి నోచుకోక గత 12 సంవత్సరాల నుంచి ఆలయ పూర్తిస్థాయిలో నిర్మాణం జరగకపోవడంతో గ్రామ మహిళలు ఈ గుడి నిర్మాణంపై వైయస్సార్ సిపి నగర ప్రధాన కార్యదర్శి గౌరీ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు సరగడం పత్ని రావు దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఆలయ నిర్మాణం పై మహిళల తోపాటు స్థానికులతో చర్చలు జరిపి ఆలయ పునర్నిర్మాణం జరిపేందుకు సన్నాహాలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగానే ఈ ఆలయ కొత్త కమిటీని నియమించడం జరిగింది. ఆలయ అధ్యక్షు రాలిగా ఇల్లిమిల్లి సుబ్బలక్ష్మి ఉపాధ్య క్షులుగా వాసుపల్లి గీత కార్యదర్శిగా డి రాధిక గౌరవ అధ్యక్షులుగా టంగుటూరి కామాక్షి మరొక గౌరవ అధ్యక్షురాలుగా సుశీల కోసాధికారిగా మంత్రి కనకమహాలక్ష్మి వజ్రపు హరిత ఎం.నాగరత్నం సంఘ సభ్యులుగా మద్దెల గౌరీ పి ఉమా ఏ పద్మ ఎస్ భవాని ఎం లతా ఎం మీనా ఎన్నుకోవడం జరిగింది వీరందరినీ పత్ని రావు పుష్పగొచ్చాలి ఇచ్చి అభినందించి పునర నిర్మాణానికై సహకరించాలని ఆయన కోరారు.

## గంజాయి కేసును చేదించిన పోలీసులు...

### నలుగురు వ్యక్తుల అరెస్టు

**విశాలాంధ్ర - చింతూరు :** మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐఎన్‌టి యు సి 327 యూనియన్ ఆఫీసులో దొరికిన 5.3 కేజీల గంజాయి కేసును పోలీసులు చేదించారు. ఈ మేరకు మోతుగూడెం పోలీస్ స్టేషన్లో సీఐ గజేంద్ర కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్వ విషయాలు వివరించారు. ఈ నెల 23 తేదీ ఉదయం న 1104 యూనియన్ కు చెందిన సూరినీడు నాయుడు మోతుగుడెం ఎస్సై నీ కలిసి 327 యూనియన్ ఆఫీసులో గంజాయి ఉన్నదని సమాచారం ఇవ్వడంతో మోతుగూడెం ఎస్ఐ 327 యూనియన్ ఆఫీసును చెక్ చేసి 5.3 కేజీలు గంజాయిని పట్టుకున్నారని తెలిపారు. ఈ విషయంపై 23వ తేదీన క్రైమ్ నెంబర్ 15/2024 యు/యస్ 8 (సి) ఆర్/డబ్ల్యూ20 (బి) (%ఊఊ%) (బి) ఆఫ్ ఎన్డిపీఎఎస్ యాక్ట్ కేసు నమోదు చేయగా సీఐ దర్యాప్తును ప్రారంభించారని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా కుట్రను చేదించి కారకులైన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినారని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ గజేంద్ర కుమార్, మోతుగూడెం ఎస్ఐ గోపాల్ రావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాడీ బిల్డింగ్‌లో 'మిస్టర్ ఆంధ్రా' చోడవరం యువకుడు

**విశాలాంధ్ర - చోడవరం :** అనకాపల్లి జిల్లా చొడవరానికి చెందిన యువకుడు కోన మణికంఠ ఈ నెల 25న విశాఖలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతగా నిలిచి 'మిస్టర్ ఆంధ్ర' టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఆంధ్ర జోనల్ శారీరక సౌష్టవ పోటీలలో 70 కేజీల విభాగంలో పాల్గొన్న మణికంఠ రెండవ స్థానం సాధించాడు. విజేతకు ఆడారి ఆనందబాబు చేతుల మీదుగా ధ్రువ పత్రం, మెమొంటో, నగదు బహుమతి అందజేశారు. చోడవరం స్టేట్ బ్యాంకు వద్ద చిన్న టిఫిన్ సెంటర్ నడుపుకుంటున్న కోన ఈశ్వరరావు, కృష్ణవేణిల సంతానం విజేత మణికంఠ. బాడీ బిల్డింగ్ కసరత్తులు ఎక్కువ ఖర్చుతో కూడు కున్నవని, ఆర్థిక స్తోమత అంత లేదని దాతలు సహకరిస్తే మరింత కష్టపడి మన చోడవరం తో పాటు రాష్ట్రస్థాయిలో పేరు తీసుకు రాగలనని మణికంఠ తెలియజేశాడు. ప్రస్తుతం మణికంఠకు గణేష్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ గణేష్, నైస్ జిమ్ లక్ష్మణరావు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. మణికంఠ విజయం పట్ల చోడవరంలో పలువురు అభినందనలు తెలియజేశారు.

## సింహాద్రినాధుని దర్శించుకున్న అవంతి

**విశాలాంధ్ర - గోపాలపట్నం :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారిని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి. శ్రీనివాసరావు దర్శించుకున్నారు. కార్య నిర్వ హణాధికారి ఎస్ శ్రీనివాసమూర్తి పూలమాల వేసి ఘనస్వాగతం పలికారు. ముందుగా ఆయన కప్పస్థంభం ఆలింగనం, బేడా ప్రదక్షిణ చేసుకుని తమ గోత్రనామాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనానంతరం వేద ఆశీర్వవచనం, స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి తీర్ధప్రసాదాలు ఈఓ అందజేశారు

## పరసనపాడు ఆర్అండ్ఆర్ కాలనీలో బాబు షూరిటీ భవిషత్ గ్యారంటీ, సూపర్ సిక్స్

**విశాలాంధ్ర - దేవీపట్నం :** దేవిపట్నం మండలం పూడిపల్లి పంచాయతీ పరగసనిపాడు ఆర్ అండ్ ఆర్ కాలనీ లో బాబు శూరిటి భవిషత్ గ్యారంటీ, సూపర్ సిక్స్ కార్యక్రమం మండల పార్టీ ఉపాధ్యక్షులు మచ్చు త్రిమూర్తులు, క్లస్టర్ ఇంఛార్జి మగాపు బాబురావు,ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోళ్ళ చంటి బాబు,అరకు పార్లమెంటు బిసి సెల్ ఉపాధ్యక్షులు మచ్చు నాగేశ్వర రావు,, మండల ఎం. ఆర్పీస్ నాయకులు పల్లపాటి నాగేశ్వర రావు,మాజీ సర్పంచ్ పెరుగాని ఏసు పూడిపల్లి మాజీ సర్పంచ్ శివ,పాతాళ పండు, కారం పోసమ్మ,మల్లేష్, కర్రి రాజీవ్,పూనెం బాబు రావు, కున్జం కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ సెల్ సమస్య లకు తక్షణ పరిష్కరాలు...

**విశాలాంధ్ర - రంపచోడవరం :** వారం వారం గ్రీవెన్స్ సెల్ లో గిరిజనుల నుంచి వచ్చే మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల దరఖాస్తులు. వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కార మార్గాల అన్వేషించి సమస్యలు పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరము ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గానోరే పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో స్పందన కార్యక్రమం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గానోరే,ఏపీవో జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు ఇరువురు కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గానోరే మాట్లాడు ఈ వారం 40 దర ఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని ధారగడ్డ, గుర్తేడు, పాతకోట పంచాయితీలలోని గిరిజనులకు ఒక్కొక్క పంచాయతీకి 20 మినీ రైస్ మిల్లు మంజూరు చేయాలని ధారగడ్డ గ్రామానికి చెందిన అక్కపల్లి కోటేంద్రం దరఖాస్తు సమర్పించారు, ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అబుసలాం, మొబైల్ మెజిస్ట్రేట్. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజ్, ఏడియం హెచ్ఓ జి.ప్రకాశం,ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, వెలుగు ఏపీడి ఎ. శ్రీనివాసరావు, ఏపీవో రబ్బర్ దుర్గేష్, సబ్ కలెక్టర్ ఆఫీస్ ఏఓ సత్య సులోచన, డాక్టర్ ఇందిరా, డాక్టర్ గోపిక,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి. డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్, ఎ.రవి కుమార్, ఏడిఏ సావిత్రి, పిహెచ్ఓ కె.చిట్టిబాబు, పిఏఓ యల్.రాంబాబు, డిఎల్ డి ఓ కోటేశ్వర రావు, సిడిపిఓ సంధ్యారాణి,జిసిసి సీనియర్ మేనేజర్ ముర్ల. వెంకట రాజారెడ్డి , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, రాజేంద్ర బాబు, మల్లికార్జునరావు, ఎఇ. పి. వెంకట రమణ, లీగల్ సెల్ డిప్యూటీ తాసిల్దార్ స్వామి, డిపిఎంలు అపర్ణ, ఏఎంఓ సి. శ్రీహరి పాల్గొన్నారు,

## మైనర్ బాలికపై పీఈటీ మాస్టర్ అత్యాచారం...

### నిందితుడిని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు, మహిళా సంఘాలు డిమాండ్

**విశాలాంధ్ర - పీఎం పాలెం :** మైనర్ బాలికలపై అత్యాచారాలు ఆగడం లేదు. తాజాగా మధురవాడ నారాయణ స్కూల్లో ఓపిటి మాస్టర్ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడి ఆ బాలికను గర్భవతిని చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషయం విశాఖలో తీవ్ర సంచలనంగా మారింది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే ఇలా కామాంధులుగా మారి బాలికలు అని కూడా చూడకుండా అత్యాచారానికి ఒడిగట్టడంపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. నారాయణ స్కూల్‌లో పిటి మాస్టర్‌గా మూడేళ్లుగా పనిచేస్తున్న ఓ మైనర్ బాలికను మాయమాటలతో వంచించి క్రీడల ముసుగులో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఫిర్యాదు అందిన వెంటనే పీఎం పాలెం పోలీసులు అతను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. సోమవారం ఉదయం వి జె ఎఫ్ ప్రెస్ క్లబ్ లో మహిళా చేతన నాయకురాలు కత్తి పద్మ నిందితుడిని తీవ్రంగా శిక్షించాలని బంధువులతో కలిసి మీడియా సమావేశం లో డిమాండ్ చేశారు. మధురవాడలోని నారాయణ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలికను స్కూల్ పిటి మాస్టర్ బెరా దుర్గా ప్రసాద్ అత్యాచారం చేసి గర్భవతిని చేశాడని తెలిపారు. బాలికపై ఈ విధంగా చేయడాన్ని తమ సంఘం ఖండిస్తుందని, ఆయనపై పోలీసులు ఇప్పటికే ఎఫ్ఎఆర్ నమోదు నమోదు చేశారన్నారు. అత్యాచార నిరోధిక చట్టం 376కి వచ్చిన సవరణ, సుప్రీంకోర్టు గైడ్లెన్స్ ని అనుసరించి పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

**కెఏ పాల్ ఆందోళన :** రాష్ట్ర వ్యాప్తంగా కుదిపిస్తున్న మైనర్ బాలికపై అత్యాచార ఘటన పై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కే.ఏ.పాల్ స్కూల్ వద్ద ధర్నాకు దిగారు. నిందితుడ్ని పోలీసులు కఠినంగా శిక్షించాలని, విదేశాల్లో ఇలాంటివి జరిగితే జీవితంలో సెక్స్ చేయడానికి పనికిరాకుండా చేస్తారన్నారు. తాను ఎంపీగా వైజాగ్‌లో గెలిస్తే ఇలాంటివి జరగకుండా చూస్తానన్నారు. అమ్మాయిలు దయచేసి ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. రానున్న రోజుల్లో ఇలాంటివి జరగకుండా చూడాలని, ముఖ్యమంత్రి ఈ ఘటన పై మౌనంగా ఉన్నారని పాల్ ఆవేదన వ్యక్తం చేశారు.

## మహిళలును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన నరేంద్ర మోడీ : ద్వారపురెడ్డి

**విశాలాంధ్ర - గొలుగొండ :** కేంద్ర రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధినాయకులు ఇచ్చిన పిలుపుమేరకు ప్రజా పోరు యాత్ర 2లో భాగంగా పర్యటించడం జరుగుతుందని బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వర రావు అన్నారు సోమవారం గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామం బీసీ కాలనీలో మండల పార్టీ అధ్యక్షుడు చందక గౌరీ నాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెడుతుంటే రాష్ట్ర ప్రభుత్వము జగన్మోహన్ రెడ్డి స్టిక్కర్లు పెట్టుకొని ప్రచారం చేసుకుంటున్నాయని ఆయన విమర్శించారు గ్రామీణ ప్రాంత నిరుపేదల కొరకు రెండు లక్షల 48 వేల 682 ఇల్లు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంజూరు చేశారని అదే విధంగా పట్టణ ప్రాంత ప్రజలకు 21 లక్ష 32 వేల 343 మందికి గృహాల మంజూరు చేశారన్నారు పట్టణ ప్రాంత ప్రజల కొరకు ఇప్పటివరకు 18 వేల 645 కోట్లు రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. ఓ వ్యక్తి సమయంలో రాష్ట్రంలో 2.68 కోట్ల మందికి ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యువజన కింద ఉచితంగా 28.5 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను అందించడం జరిగిందని చెప్పారు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అరాచక పాలనపై ప్రజలందరూ ఆలోచించి రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని ఆదరించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిలు వర్మ ,కొండబాబు, అసెంబ్లీ కన్వీనర్ ఎర్రి నాయుడు, వెలగ జగన్నాథం ప్రజా పోరి యాత్ర కన్వీనర్ గౌ రెడ్డి శ్రీనాథ్ అరిమిల రాజు రీముల చంద్రరావు అడిగర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు

## విశ్వేశ్వరరాజు నిజం చెప్పండి...భారత్ ఆదివాసి పార్టీ

**విశాలాంధ్ర - జీకేవీధి :** పాడేరు నియోజక వర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అయిన మత్స్యరాస విశ్వేశ్వరరాజు నిజం చెప్పాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. సోమవారం భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు డా.పి.రామకృష్ణ, రాష్ట్ర ఉపా ధ్యక్షులు తెల్లంశేఖర్ దొరతో కలిసి మీడియాతో మాట్లాడారు. బోయవాల్మీలను గిరిజన జాబితాలో కలపొచ్చని ఎస్టీ కమీషన్ రిపోర్ట్ ఇస్తే, ఆ రిపోర్ట్ ఆధారంగానే బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో కలపాలని సాక్షత్తు ముఖ్య మంత్రి శాసన సభలో చెప్పారని, ఎస్టీ కమీషన్ చైర్మన్ గా ఉన్న కుంభ రవిబాబుకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి మళ్ళీ ప్రభుత్వం వస్తే మంత్రి పదవి ఇవ్వడానికి ఒప్పందం కుదిరిందని, అలాగే బోయ వాల్మీకుల నుండి ఎక్కువ మొత్తంలో చేతికందినట్లు చెప్పుకొంటున్నారన్నారు. రవిబాబు మైదానవాసి కాబట్టి ఆదివాసీల మీద కనికరం, జాలి, దయ ఉండకపోవచ్చు,కానీ ఎస్టీ కమీషన్ సభ్యులుగా ఉన్న విశ్వేశ్వరరాజు గానీ మిగతా వారు కానీ ఎందుకు రిపోర్ట్ ఇచ్చారని అంటున్నారు

.రవిబాబుకు హామీ ఇచ్చినట్లు విశ్వేశ్వరరాజుకు హామీ ఇచ్చి పాడేరు నియోజకవర్గం సమన్వయకర్త తర్వాత ఎమ్మెల్యే టిక్కెట్ కు హామీ ఇచ్చినట్లు తెలిసిందని, అలాగే బోయవాల్మీకుల నుండి ఎంత అందిందో కూడా ఆయనే తెలపాలి, లేదంటే ఎస్టీ కమీషన్ ఎటువంటి రిపోర్ట్ ఇచ్చిందో చెప్పాలి .ఆ రిపోర్ట్ లో విశ్వేశ్వరరాజుతో పాటు మిగతా వారు సంతకం పెట్టరో లేదో తెలిపాలని, విశ్వేశ్వరరాజు మాట్లాడకుండా మౌనంగా ఉంటే మౌనమే అంగీకారంగా ఆదివాసీలు భావిస్తారని,ఆ రిపోర్ట్ మీద సంతకం పెట్టారా లేదా స్పష్టంగా సమాధానం చెప్పాలన్నారు.